## క్లుప్తంగా

### కోదండరాముని కల్యాణోత్సవాలకు శ్రీకారం

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం బావాజీమఠంలోని కోదండరామస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఉత్సవాల్లో భాగంగా స్వామిని పెండ్లికుమారుడిగా, అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకుడు ఆసూరి రంగనాథాచార్యుల ఆధ్వర్యంలో విశేషపూజలు జరిపారు. మంగళవారం సాయంత్రం అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ఎదుర్కోలు సన్నాహం, అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

### ఎమ్మెల్సీ జయమంగళ పుట్టిన రోజు వేడుక



కైకలూరు: ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పుట్టిన రోజు వేడుక సోమవారం ఘనంగా జరిగింది. ఆటపాకలో ఆయన నివాసం వద్ద ఉదయం నుంచి సందడి వాతావరణం కనిపించింది. కేక్ కట్ చేసి సంతోషాన్ని నాయకులతో పంచుకున్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆధ్వర్యంలో భారీ కేక్‌ను ఎమ్మెల్సీ కట్ చేశారు. ఎమ్మెల్యే డీఎన్నార్ కేక్ తినిపించారు. పలు గ్రామాల నాయకులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

### మళ్లీ సీఎంగా జగన్‌ను ఆశీర్వదించాలి



మండవల్లి: పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందించి వారి హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. సోమవారం మండవల్లిలోని 7, 10 వార్డులలో 6వ రోజు గుడ్‌మార్నింగ్ మండవల్లి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్, నాయకులు ముంగర మల్లికార్జునరావు, సొసైటీ అధ్యక్షుడు గుడివాడ బాబీ, మాజీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ, మాజీ ఎంపీపీ గోపాలకృష్ణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు పాల్గొన్నారు.

### వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

కైకలూరు: నిస్వార్థంగా సేవ చేస్తున్నా తమను ప్రతిపక్షాలు హేళన చేసి అవమానిస్తున్నాయని, ఇది తట్టుకోలేక రాజీనామాలు చేస్తున్నామని భుజబలపట్నం, కానుకొల్లు గ్రామాల వలంటీర్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ముందు వాపోయారు. వలంటీర్ బాధ్యతలకు రాజీనామా చేసిన వారు సోమవారం ఏలూరు రోడ్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. జగనన్నకు నేరుగా సేవలు అందించి, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలను గెలిపించుకోడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

### ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

మండవల్లి: పెరికెగూడెంలో కొలువై ఉన్న శ్రీ వినయ ప్రభావాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం మాజీ సర్పంచ్ కారుమూరి వీరరాఘవయ్య కుమారుల ఆధ్వర్యంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పెరుమాళ్ల పద్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

### విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డిక్లరేషన్ తీసుకోవాలి

కలిదిండి: విద్యార్థులు మరో పాఠశాలలో చేరాలంటే తల్లిదండ్రుల నుంచి డిక్లరేషన్ తీసుకోవాలని ఎంఈఓ పి.ప్రభాకరావు చెప్పారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల మ్యాపింగ్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన విధానం ప్రవేశపెట్టారన్నారు. గతంలో విద్యార్థి పాఠశాల మారినట్టయితే వారి పేరును డ్రాప్‌బాక్స్‌లో ఉంచి, తదుపరి వారి చేరిన పాఠశాలల్లో వారికి ప్రవేశాలు కల్పించేవారన్నారు. ఈ విధానం వల్ల ఏ విద్యార్థి ఏ పాఠశాలలో ఉన్నారో తెలుసుకోవడం కష్టంగా ఉండేదన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం కొత్త విధానం అమలు చేయనుందన్నారు. పాఠశాలలో ఉన్న అత్యధిక తరగతి పూర్తి చేసిన తర్వాత ఏ పాఠశాలలో చేరుతారో వారి తల్లిదండ్రుల నుంచి డిక్లరేషన్ పొంది సదరు పాఠశాలలకు మ్యాపింగ్ చేసే బాధ్యత హెచ్ఎంలకు అప్పగించారన్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో చేరాలనుకున్నా వాటి మ్యాపింగ్ చేసే బాధ్యత హెచ్ఎంలకు అప్పగించినట్లు తెలిపారు. ఇది ఈ నెల 20వ తేదీలోగా పూర్తిచేయాలని హెచ్ఎంలకు ఆదేశించామని ఎంఈఓ పేర్కొన్నారు.

# సంక్షేమ సారథికి జేజేలు



బస్సు యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



బస్సు యాత్రలో సీఎం వైఎస్ జగన్‌ను చూసి యువకుల కేరింతలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఉత్సాహంతో జై జగన్ అంటున్న మహిళ



గుడివాడలో మేమంతా సిద్ధం సభకు ట్రాక్టర్లో వెళుతున్న అభిమానులు



గుడివాడలో ఎమ్మెల్యే కొడాలి నానిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఆనందోత్సాహం

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయ సంకల్పంతో అడుగులు వేస్తుంటే.. ప్రజలు.. 'మేమంతా సిద్ధం' అంటూ సంక్షేమ సారథికి జయహో అంటూ స్వాగతం పలికారు. జిల్లాలో జరుగుతున్న మేమంతా సిద్ధం బస్సుయాత్రకు సోమవారం ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర గన్నవరం నుంచి గుడివాడ నియోజకవర్గంలో ప్రవేశించినప్పటి నుంచి వీధులు వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులతో జనసంద్రంగా మారాయి. విజయవాడలో వైఎస్ జగన్‌పై దాడి జరిగిన అనంతరం ఒకరోజు విరామం తర్వాత బస్సుయాత్ర మొదలు కావడంతో ఆయన్ను చూడటానికి మహిళలు, వృద్ధులు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. 'జై జగన్.. నువ్వే మా నమ్మకం.. మళ్లీ మీరే సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. అభిమానులకు ప్రతిస్పందనగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిరునవ్వుతో నమస్కరిస్తూ ముందుకు సాగారు. గుడివాడలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభాస్థలి వరకు అడుగడుగునా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



బస్సులో ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దిష్టి తీస్తున్న మహిళ



గుడివాడలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు పోటెత్తిన జనసందోహంలో ఓ భాగం (ఇన్‌సెట్‌లో) సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని

# జన 'గుడి'వాడ

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు పోటెత్తిన ప్రజలు
- పామర్రు– కత్తిపూడి జాతీయ రహదారి జనసంద్రం

గుడివాడ రూరల్: మేమంతా సిద్ధం సభతో గుడివాడ దద్దరిల్లింది. వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన బస్సు యాత్ర సోమవారం పట్టణానికి చేరుకోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. గన్నవరం నియోజకవర్గంలోని ఆరుగొలను మీదుగా మధ్యాహ్నం 2.30 గంటలకు యాత్ర పెదలింగాల వద్ద నియోజకవర్గంలోకి చేరుకుంది. అక్కడే ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి జనార్దనపురం శివారు ప్రాంతంలో మధ్యాహ్నం 3.30 గంటలకు సీఎం జగన్ భోజన విరామం తీసుకున్నారు. అనంతరం నాగవరప్పాడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీఎం జగన్ ఐదు గంటలకు చేరుకున్నారు. మార్గ మధ్యంలోని ప్రజలకు అభివాదం చేసుకుంటూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

**రెట్టించిన ఉత్సాహం**

అశేష జన వాహిని మధ్య సీఎం జగన్ సభా వేదికను అలంకరించారు. సీఎం జగన్ వేదిక మీదకు రావడంతోనే సభా ప్రాంగణంలో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు రెట్టించిన ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. జై జగన్.. జైజై జగన్ అనే నినాదాలతో ఆ ప్రాంతం మారు మోగింది. గుడివాడ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పామర్రు, పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున అభిమానులు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. గుడివాడ పట్టణంలోని నెహ్రూ చౌక్, ఏలూరు రోడ్డు, నాగవరప్పాడు ప్రాంతాల్లోని రహదారులు జనంతో నిండిపోయాయి. ఎటూ చూసి జన సందోహమే కనిపించింది. సభా ప్రాంగణం చుట్టూ ఉన్న ఇళ్ల పై నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తూ కేరింతలు కొడుతూ ప్రజలు ఉత్సాహంగా డ్యాన్సులు వేశారు.

**యువత ఫుల్ జోష్**

గుడివాడ రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు గుడివాడ విచ్చేసిన నేపథ్యంలో పట్టణం నుంచి యువత చేపట్టిన బైక్ ర్యాలీలు సందడి సందడిగా సాగాయి. గన్నవరం నియోజకవర్గంలోని ఆరుగొలను వరకు సీఎంకు బైక్‌లతో ఎదురెళ్లి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి నాగవరప్పాడు సిద్ధం సభ వరకు ఈ ర్యాలీ సాగింది. సిద్ధం బ్యానర్లు, ప్లకార్డులు, పార్టీ జెండాలు, స్టిక్కర్లతో యువత ఫుల్ జోష్‌గా ఈ ర్యాలీని కొనసాగించారు.

**ఆకట్టుకున్న జగన్ ప్రసంగం**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఆద్యంతం ప్రజలను ముగ్ధులను చేసింది. ప్రసంగ సమయంలో ప్రతిపక్షాలపై చేసిన విమర్శలకు ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అదేవిధంగా గడిచిన 58 నెలల పరిపాలనతో ప్రజలకు చేసిన మంచిని జగన్ వివరిస్తున్నప్పుడు.. 'మళ్లీ నువ్వే రావాలన్నా.. మళ్లీ నువ్వే సీఎం కావాలన్నా' అనే నినాదాలతో ప్రాంగణం మారు మోగింది. ప్రధానంగా జిల్లా అభివృద్ధిని వివరిస్తున్న సమయంలో.. జగనన్న.. జగనన్న అంటూ ప్రజలు ఊగిపోయారు. దుష్టచతుష్టయం చేసిన కుట్రలు, బూటకపు హామీలతో చంద్రబాబు చేసే మోసాలను వివరిస్తున్నప్పుడు ప్రజలు రెండు చేతులెత్తి 'చంద్రబాబు వద్దు.. జగనన్నే ముద్దు' అంటూ నినాదాలు చేశారు.

**క్యాడర్‌లో అమితోత్సాహం**

ముగింపు సమయంలో జిల్లాలోని ఎంపీ అభ్యర్థితో పాటు ఎమ్మెల్యే అభ్యర్థులను సీఎం జగన్ వేదికపై అధికారికంగా ప్రకటించారు. ఈ సమయంలో ఒక్కో అభ్యర్థిని ప్రకటిస్తున్న సమయంలో వారివారి నియోజకవర్గాల నుంచి వచ్చిన అభిమానులు, ప్రజలు చప్పట్లతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. గుడివాడ అభ్యర్థిగా కొడాలి నానిని ప్రకటించే సమయంలో సభ మారు మోగింది. జై కొడాలి.. జై జై కొడాలి.. జిందాబాద్ జగనన్న అనే అంటూ మహిళలు నినాదాలు చేశారు. ప్రసంగం ముగించి వాక్ ర్యాంప్ పై జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నప్పుడు జగన్‌ను దగ్గర నుంచి చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. మహిళలు సైతం గ్రిల్స్ ఎక్కి జగన్‌కు అభివాదం చేస్తూ కేరింతలు కొట్టారు. అనంతరం బస్సు యాత్ర నాగవరప్పాడు నుంచి పెదలింగాల, పుట్టగుంట మీదుగా హనుమాన్ జంక్షన్ వైపునకు వెళ్లింది. కార్యక్రమంలో మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని), మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్, పామర్రు ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్ కుమార్, అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్, పెనమలూరు ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్, పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, నాగరాజు వైఎస్సార్‌సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రామ్‌ప్రసాద్, మండలి హనుమంతరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మేరుగుమాల కాళీ, ఎంపీపీలు పెయ్యల ఆదాం, గద్దె పుష్పరాణి, కొడాలి సురేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, ఏఎంసీ చైర్మన్ మట్టా నాగమణి విక్టర్, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

### మండుటెండను సైతం లెక్క చేయకుండా..

గుడివాడ రూరల్: సీఎం జగన్‌ను చూసేందుకు గుడివాడకు జనం పోటెత్తారు. వీరిలో ప్రధానంగా మహిళలు, వృద్ధులు మండుటెండను సైతం ఖాతరు చేయకుండా జగన్ చూసేందుకు మూడు గంటల పాటు రహదారి వెంబడి వేచి ఉన్నారు. అన్నం పెట్టే అభిమాన నాయకుడిని చూసేందుకు తమకు ఈ ఎండ లెక్క కాదని వారు చెప్పడం గమనార్హం. ఎంత టైమ్ అయినా సీఎం జగన్‌ను చూసిన తరువాతనే ఇక్కడ నుంచి కదులుతామని గంటా పథంగా చెప్పారు.

### వైఎస్సార్ సీపీలో చేరిన బొడ్డు రమేష్‌యాదవ్



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఆలిండియా యాదవ మహాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు రమేష్ యాదవ్ పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సీఎం జగన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



గుడివాడలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభలో ర్యాంప్ వాక్ చుట్టూ అభిమానుల సందడి

## మేమంతా సిద్ధం సభకు స్వచ్ఛందంగా తరలిన అభిమానులు

పామర్రు: పామర్రు నుంచి గుడివాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిద్ధం సభకు సోమవారం వేలాదిగా వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక ప్రజలు ర్యాలీగా బస్సులలో, కార్లలో, ఆటోలలో తరలి వెళ్లారు. తొలుత ర్యాలీని పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా జగనన్నను ఆపలేరన్నారు. జగన్‌పై రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా రానున్న కాలంలో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, పామర్రు ఎమ్మెల్యేగా కైలే అనిల్‌కుమార్‌కు ఘన విజయం అందించేందుకు ప్రజలు అందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. విజయవాడ కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టుబోర్డు జిల్లా సభ్యులు కృష్ణారెడ్డి, నాయకులు సుబ్రమణ్యం, మాధవరెడ్డి, రాజేష్, ఏ శ్రీహరి, ప్రకాష్ పాల్గొన్నారు.

**తోట్లవల్లూరు నుంచి..**

తోట్లవల్లూరు: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా గుడివాడలో సోమవారం నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు స్వచ్ఛందంగా భారీగా తరలివెళ్లారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పీఎస్ కోటేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గుడివాడ వెళ్లిన వారిలో ఉన్నారు.



మొవ్వ మండలం భట్లపెనుమర్రు నుంచి గుడివాడ సభకు వెళ్లిన నాయకులు

**మొవ్వ మండలం నుంచి..**

మొవ్వ: గుడివాడలో నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మొవ్వ మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివెళ్లారు. మండలంలోని 21 గ్రామాల నుంచి బస్సులు, ద్విచక్రవాహనాల పై ఎండను సైతం లెక్కచేయకుండా జై జగన్.. నినాదాలు చేసుకుంటూ గుడివాడకు తరలివెళ్లారు.



పామర్రు నుంచి సీఎం సభకు బయలుదేరిన నాయకులు, అభిమానులు



తోట్లవల్లూరు మండలం చినపులిపాక నుంచి గుడివాడ సభకు వెళుతున్న కార్యకర్తలు

**గుడ్లవల్లేరు నుంచి..**

గుడ్లవల్లేరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుడివాడలో నిర్వహించిన సభకు గుడ్లవల్లేరు మండలం నుంచి వేలాది మంది జనం తరలి వెళ్లారు. కొండలమ్మ ఆలయ చైర్మన్ శేషం గోపి, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ ప్రభాకరరావు, నాయకులు శివకృష్ణ, ప్రవీణ్, దాదా, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా స్థానిక ఏలూరు రోడ్ వద్ద వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హాజరయ్యారు. నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారులు వినయ్, శ్యామ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ బీజేపీ నాయకులు కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా మాట్లాడుతున్నారన్నారు. తుపానులా వచ్చే ఫ్యాను గాలికి ఎన్డీఏ కూటమి మట్టికరుస్తుందన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో తాను టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు ప్రస్తుత బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ఏ మాత్రం సహకరించలేదన్నారు. ఏమైనప్పటికి జూన్ 4వ తేదీ కౌంటింగ్ అయిన తర్వాత అమెరికా వెళ్లే కామినేని శ్రీనివాస్‌కు విమానం వద్ద వీడ్కోలు చెబుతానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు అడవి కృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గా ప్రసాద్, చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీరరాజు, సర్పంచ్ దా నం మేరీ నవరత్నకుమారి, నాయకులు గాదిరాజు నారాయణరాజు, నిమ్మగడ్డ భిక్షాలు, నయ్యపురాజు గుర్రాజు, గుమ్మడి వెంకటేశ్వరరావు, నంబూరి శ్రీదేవి, గంటా సంధ్య, రవిరాజు, బయినాల బ్రహ్మాజీ, మంగినేని రామకృష్ణ, చెన్నంశెట్టి సోమేశ్వరరావు, మెండా సురేష్, కాల్వ నల్లయ్య, గోకర్ణయాదవ్, ప్రసాద్, మహమ్మద్ జహీర్, అబ్దుల్ హమీద్, షేక్ రఫీ, రమేష్, దాన్ బాషా పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ